సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

అప్రకటిత విద్యుత్ కోతలు

ఆరిలోవ : ఆరిలోవలో అప్రకటిత విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయి. ఎప్పుడు కరెంట్ తీసేస్తారో తెలియక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కరెంట్ లేకపోవడంతో ఓ పక్క ఫ్యాన్‌లు తిరగక ఉక్కపోత, మరో పక్క మోటార్ వేసుకోలేక నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరుచూ కరెంట్ కోతలతో సమస్యలు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. లీలాసుందరినగర్, నెహ్రూనగర్, టి.ఐ.సి.పాయింట్, అంబేద్కర్‌నగర్, జ్యోతినగర్, సుందర్రయకాలనీ, కోకా కోలా బిల్డింగ్ ప్రాంతం, తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు ఆరున్నర గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపేశారు. ఇలా తరచూ అప్రకటిత కోతలతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు అంటున్నారు. కరెంట్ కోతలు విధించినప్పుడు విద్యుత్ విభాగం అధికారులు ముందుగా ప్రకటించి ప్రజలకు తెలియజేస్తే... కరెంట్ ఉన్నప్పుడే మోటార్లు వేసుకుని ట్యాంకుల్లో నీరు నింపుకోవడానికి అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

తల్లిపాలతో శిశువులకు సంపూర్ణ ఆరోగ్యం



గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో

ఆరిలోవ : జీవీఎంసీ పదకొండో వార్డు పరిధి గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యతను సీడీపీవో నీలిమ, ఏసీడీపీవో శ్రీలత వివరించారు. ఈ నెల 7 వరకు తల్లిపాల వారోత్సవాలు కొనసాగుతాయన్నారు. తల్లి పాలు తాగిస్తే శిశువులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. తల్లి పాల వల్ల శిశువుల్లో రోగ నిరోధక శక్తి పెరగడంతోపాటు బ్రెయిన్ అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శ్యామల, రమాదేవి, ఏఎస్ఎం సరళ, మాధవి, ఆశా కార్యకర్తలు జయ, దయానా, ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఏయూ ఉద్యోగులకు టైం స్కేల్ వర్తింపజేయాలని వినతి

ఎంవీపీ కాలనీ : ఏయూలో 28 రోజులు, కాంట్రాక్ట్, కన్సాలిడేటెడ్ ఉద్యోగులకు టైం స్కేల్ హోదా కల్పించాలని పలువురు ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయినా ఏయూలోని కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఎలాంటి ప్రయోజనమూ కల్పించలేదన్నారు. ప్రభుత్వంతో, ఏయూ వీసీతో చర్చించి అందరికీ టైం స్కేల్ వర్తింపజేసి ఆర్థిక, ఉద్యోగ భరోసా కల్పించాలని కోరారు.

డిగ్రీ ప్రవేశాలు పూర్తి చేయాలి

మద్దిలపాలెం : రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చిలోనే పూర్తయ్యాయని... ఏప్రిల్‌లో ఫలితాలు విడుదలైనప్పటికీ ఇప్పటి వరకూ డిగ్రీ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభించకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు గౌనిపల్లి కిరణ్ కుమార్ అన్నారు. ప్రభుత్వం ఆలస్యం చేయడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకొని డిగ్రీ ప్రవేశాల ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలి కోరారు.

ప్రతిభ ఆధారంగానే ఉత్తీర్ణత

మద్దిలపాలెం : విద్యార్థులు తమ ప్రతిభతోనే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తారని ఏయూ పరీక్షల డీన్‌లు ఆచార్య జి.నానాజీరావు, ఆచార్య బి.ముని స్వామి అన్నారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు స్పెషల్ ఎగ్జామినేషన్ పరీక్షను నిర్వహిస్తున్నామని... దానికి ప్రత్యేక రుసుమును పరీక్ష ఫీజు రూపంలో విద్యార్థి చెల్లిస్తారని తెలిపారు. స్పెషల్ ఎగ్జామినేషన్ పరీక్షకు ఫీజు చెల్లించిన ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలనే నియమం లేదని స్పష్టం చేశారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ... కొంతమంది విద్యార్థులు తాము ప్రత్యేకంగా ఫీజు చెల్లించామని, తమను ఉత్తీర్ణులను చేయాలని కోరడం సమంజసం కాదని స్పష్టం చేశారు. అనైతికమైన ఇటువంటి డిమాండ్లను విద్యార్థులు అధికారుల దృష్టికి తీసుకురావడం సరి కాదని చెప్పారు. పరీక్షల మూల్యాంకనం పటిష్టంగా ఉంటుందని, విద్యార్థి మెరుగైన ప్రతిభ చూపిస్తేనే ఉత్తీర్ణత సాధిస్తారని తెలిపారు. దీర్ఘకాలంగా కొన్ని సబ్జెక్టులలో తప్పిన విద్యార్థుల అభ్యర్థనను పరిశీలించి మానవతా దృక్పథంతో స్పెషల్ ఎగ్జామినేషన్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు.



బుద్ధుని విగ్రహానికి ఇరువైపులా పొదల్లో మద్యం సీసాలు



పగిలిపోయిన టైల్స్



ప్రస్తుతం నీరు లేక అధ్వానంగా దర్శనమిస్తున్న కొలను

ఆనాటి అందాల పార్కు.. నేడు కళావిహీనం

- ఏడాదిలో అధ్వానంగా జెన్ పార్క్
- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డా
- జీవీఎంసీ కమిషనర్ బంగ్లా పక్కనున్న పార్కునే పట్టించుకోని అధికారులు



నీటి ప్రవాహం లేక బోసిపోయిన పార్కు

బీచ్‌రోడ్డు : నగరం మధ్యలో ఓ చిట్టడవి.. అందులో జలపాతాన్ని తలపించేలా చిన్న చిన్న నీటి ప్రవాహాలు.. వాటి మధ్యలో బుద్ధుడి విగ్రహం.. చుట్టూ కుందేళ్లు, జింకలు, ఏనుగుల సమూహం... ఇదీ ఏడాది కిందట జీవీఎంసీ సృష్టించిన జెన్ పార్క్‌లో సన్నివేశాలు. కానీ ఇప్పుడు ఆ పార్కు కళావిహీనంగా మారిపోయింది. జలపాతం మాయమైంది.. వాటర్ ఫౌంటెన్‌లో నీరు లేక అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఇంకా జింకలు, కుందేళ్లు, ఏనుగుల బొమ్మలు శిథిలమైపోయాయి. జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఏడాది కాలంలోనే పార్కు అధ్వానంగా తయారైందని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 28వ వార్డులోని సంపత్ వినాయక ఆలయం రోడ్డులో కమిషనర్ బంగ్లాకు ఆనుకుని జెన్ పార్క్ ఉంది. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జీవీఎంసీ అధికారులు ఎంతో సుందరంగా దీన్ని తీర్చిద్దారు. ఆ పార్కులోకి వెళ్తే ఒక చిట్టడవిలోకి వెళ్లిన అనుభూతి పర్యాటకులు, నగరవాసులకు కలిగేది. కానీ ఇప్పుడు ఆ పార్కులోకి వెళ్తే అసంతృప్తితో సందర్శకులు వెనుదిరుగుతున్నారు.

ఎండిపోయిన నీటి కొలనులు

జెన్ పార్కులో గతంలో చిన్నచిన్న నీటి ప్రవాహాలతో కూడిన నీటి కొలనులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేవి. నిర్వహణ లోపంతో ఇప్పుడు ఆ నీటి కొలనుల్లో నీరు ఎండిపోయింది. ప్రవాహాలు ఆవిరైపోయాయి. దీంతో పార్క్‌లో ప్రధాన ఆకర్షణ లేకుండా పోయింది. పార్క్ ముఖ ద్వారం వద్ద ఉన్న ఈ కొలనులు ఎండిపోవడంతో అధ్వానంగా కనిపిస్తున్నాయి. సందర్శకులకు ప్రవేశ ద్వారం వద్దే నిరాశ చెందుతున్నారు.

ఎక్కడ చూసినా మద్యం సీసాలే

పార్కును జీవీఎంసీ అధికారులు పూర్తిగా గాలికి వదిలేయడంతో రాత్రి వేళల్లో విద్యుత్ దీపాలు సైతం పని చేయడం లేదు. దీంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా ఈ జెన్ పార్కు మారిపోయింది. నగరంలో ఒకనాడు ప్రత్యేకంగా రూపొందించిన ఈ పార్కు ఇప్పుడు అసాంఘిక కార్యక్రమాలకు వేదిక అవుతుందని ఊహించలేదని సందర్శకులు వాపోతున్నారు. పార్కులో ఎక్కడ చూసినా మద్యం సీసాలే దర్శనమిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



జెన్ పార్కులో ఏడాది కిందట ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన కొలనులు

శిథిలమైన జంతువుల ఆకృతులు

చిట్టడవి అంటే జంతువులు కూడా నివసించాలనే ఉద్దేశ్యంతో పార్కులో కుందేళ్లు, జింకలు, ఏనుగుల ఆకృతులను అప్పట్లో అధికారులు ఏర్పాటు చేశారు. అయితే ఇప్పుడు వాటిలో చాలా వరకు శిథిలమైపోయాయి. జింకల బొమ్మల కొమ్ములు విరిగిపోయాయి. ఏనుగు, కుందేళ్ల ఆకృతులు కనుమరుగయ్యాయి. దీంతో చిట్టడవిలోకి వెళ్లామనే అనుభూతి ఎవరికీ కలగడం లేదు.

కమిషనర్ నివాసం పక్కనే ఉన్నా...

జీవీఎంసీ కమిషనర్ నివసించే బంగ్లాకు అనుకునే జెన్ పార్కు ఉంది. జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి కూడా కూతవేటు దూరంలోనే ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు నిర్వహణను గాలికొదిలేశారు. రోజూ కార్యాలయానికి కమిషనర్ ఆ పార్కు పక్క నుంచే వెళ్తుంటారు. అయినప్పటికీ దీని నిర్వహణను అధికారులు పట్టించుకోలేదంటే నగరంలోని మిగిలిన పార్కుల పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. నగరంలో ఎంతో ప్రత్యేకంగా రూపొందించిన జెన్ పార్కుపై జీవీఎంసీ అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించాలని సందర్శకులు కోరుతున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసి... పార్కును సుందరంగా తీర్చిదిద్ది పూర్వవైభవం తీసుకురావాలని కోరుతున్నారు.



కొమ్ములు విరిగిపోయిన పార్కులోని జింకల ఆకృతులు

రేపు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని యోగా విభాగం ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ఈ నెల 3న బీచ్‌రోడ్డులో గల యోగా విలేజ్‌లో నిర్వహిస్తామని ఆచార్య రమేష్‌బాబు తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 11 వరకు డాక్టర్ ఈశ్వరరావు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేస్తారని.. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని, వివరాలకు 944019167ను సంప్రదించాలని సూచించారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచాలి



అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ మువ్వల లక్ష్మి

బీచ్‌రోడ్డు : విష వ్యాధులకు కారణమైన దోమల నియంత్రణ కోసం పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జీవీఎంసీ 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి సూచించారు. చినవాల్తేరు కేడీపీఎం హైస్కూల్‌లో మలేరియా, డెంగ్యూ, తదితర వ్యాధుల నియంత్రణపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలని, వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి సూచించారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్, మలేరియా డిపార్ట్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ బంధం శ్రీనివాస్, సంధ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఆరిలోవ : జోడుగుళ్లపాలెం తీరానికి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శుక్రవారం కొట్టుకొచ్చింది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఆరిలోవ ఎస్ఐ కృష్ణ సిబ్బందితో తీరానికి చేరుకుని పరిశీలించారు. ఆధారాలు మాత్రం లభించలేదు. చేతిపైన జగదీష్, పొట్టపైన అమ్మ అని పచ్చబొట్టుతో రాసి ఉన్నట్లు ఎస్ఐ కృష్ణ తెలిపారు. వివరాలు తెలియకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేసి కేజీహెచ్ మార్చురీకి తరలించినట్లు తెలిపారు. మృతుని బంధువులు ఆరిలోవ పోలీసులను సంప్రదించాలని ఆయన కోరారు.

అసైన్‌మెంట్ పుస్తకాల పంపిణీ

ఆరిలోవ : చినగదిలి మండలంలో అసైన్‌మెంట్ పుస్తకాలు శుక్రవారం నుంచి పాఠశాలలకు పంపిణీ చేయడం ప్రారంభించారు. మండల కేంద్రం తోటగరువు ఉన్నత పాఠశాలలో సిద్ధమైన ఈ పుస్తకాలను అందుబాటులో ఉన్న పాఠశాలల ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ కేంద్రాన్ని శుక్రవారం ఎంఈవో 1 సీహెచ్.రవీంద్రబాబు, ఎంఈవో 2 పి.అనురాధ సందర్శించారు. వాటి కోసం వచ్చిన మండలంలోని కొన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు అందజేశారు. మిగిలిన పాఠశాలల ఉపాధ్యాయులు కూడా వీటిని తీసుకెళ్లాలని ఎంఈవోలు సూచించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు ఈ పుస్తకంలో ఫార్మాటివ్, సమ్మెటివ్ పరీక్షలు రాయాల్సి ఉందన్నారు. పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు యథావిధిగా రాస్తారన్నారు. మండలంలో 12,691 మంది విద్యార్థులకు సరపడా పుస్తకాలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తోటగరువు హైస్కూల్ హెచ్ఎం జి.కె.దుర్గాభవానీ, సీఆర్‌పీలు, పీడీలు, పీటీ పాల్గొన్నారు.



అసైన్‌మెంట్ పుస్తకాలతో ఎంఈవోలు, ఉపాధ్యాయులు

ఎంఈవోలుగా అందరికీ అవకాశమివ్వాలి

ఆరిలోవ : ఎంఈవో 1 పోస్టులకు నియామకాలు చేపట్టేటప్పుడు అన్ని పాఠశాలల స్కూల్ అసిస్టెంట్లకు అవకాశం కల్పించాలని పీఆర్‌టీయూ, ఆపస్ సంఘాల ఉపాధ్యాయులు డీఈవో ఎస్.ప్రేమకుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు మాత్రమే ఎంఈవో 1గా నియమించడానికి ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలను వెనక్కు తీసుకోవాలని కోరారు. ఇది ఉమ్మడి సర్వీస్ రూల్‌కు విఘాతం కల్పించడమేనని తెలిపారు. దీనికి నిరసనగా నల్ల బ్యాడ్జీలతో జిల్లాలోని పాఠశాలల్లో చెక్‌డౌన్ చేపట్టినట్లు తెలిపారు. ఒకే డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు కామన్ సీనియారిటీ ప్రాతిపదికన మండల విద్యాధికారులుగా నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మద్దు శ్రీను, నాగేశ్వరరావు, అరుణ్‌కుమార్, విశ్వనాథ, సన్యాసినాయుడు, సుదర్శన్ పట్నాయక్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



డీఈవో ప్రేమకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఐఐఏఎంలో 'అడ్మిషన్స్ ఆన్ వీల్స్' ప్రారంభం

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలోని ఇంటిగ్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ (ఐఐఏఎం) బిజినెస్ స్కూల్ ఆధ్వర్యంలో అడ్మిషన్స్ ఆన్ వీల్స్ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య బాలమోహన్‌దాస్, ఐఐఏఎం డీన్ డాక్టర్ సుంకరి రవీంద్ర, బిజినెస్ స్కూల్ డైరెక్టర్ జనరల్ ఆచార్య కృష్ణమోహన్ శుక్రవారం ఎంవీపీ కాలనీలోని కళాశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత విద్యను అందరికీ అందుబాటులోకి తేవడమే అడ్మిషన్స్ ఆన్ వీల్స్ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వాహనం ద్వారా ఉన్నత విద్యా అవకాశాలను పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వివరిస్తామని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఐఐఏఎం బీ స్కూల్ ఉన్నతమైన కోర్సులను అందిస్తోందన్నారు.



అడ్మిషన్స్ ఆన్ వీల్స్ వాహనాన్ని ప్రారంభిస్తున్న బాలమోహన్‌దాస్, తదితరులు

స్మార్ట్ మీటర్లతో ప్రజలపై ఆర్థిక భారం

ఆరిలోవ : ఆరిలోవ సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం ఐక్య సంఘాల ప్రజా వేదిక నిర్వహించారు. ఇందులో సీఐటీయూ, ఐద్వా, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య తదితర ప్రజా సంఘాల ప్రతినిధులు సమావేశమయ్యారు. వారంతా స్మార్ట్ మీటర్లు, వాటి వల్ల ప్రజలపై పడే ఆర్థిక భారంపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అదానీ స్మార్ట్ మీటర్లు బిగించి ప్రజలపై ఆర్థిక భారం మోపుతోందని ఆరోపించారు. ఈ స్మార్ట్ మీటర్లను ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం వెంటనే స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మీటర్ల పేరుతో 93 వాయిదాల్లో రూ.9 వేల నుంచి రూ.13 వేల వరకు ప్రజల నుంచి వసూలు చేయనున్నారన్నారు. ఇప్పటికే అదనంగా విద్యుత్ చార్జీలు వసూలు చేస్తున్నారన్నారు. ఈ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా, పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 2న విద్యుత్ శాఖ ఏఈల కార్యాలయాల వద్ద, ఈ నెల 5న సీఎండీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. నరేంద్రకుమార్, శంకరరావు, కాసుబాబు, లక్ష్మణరావు, శాంతి పాల్గొన్నారు.



ఆరిలోవ సీఐటీయూ కార్యాలయంలో నాయకులు

కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని విస్మరించింది

- వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త మొల్లి అప్పారావు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ 17వ వార్డు నాయకులు



ఆరిలోవ కాలనీలో మహిళకు కరపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మొల్లి అప్పారావు

ఆరిలోవ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో వైఎస్సార్‌సీపీ నాయకులను వేధిస్తోందని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆరోపించారు. జీవీఎంసీ పదమూడో వార్డులో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ వార్డు అధ్యక్షుడు సత్యాల వెంకట్, స్థానిక నాయకులతో కలిసి మొల్లి అప్పారావు ఆరిలోవ కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కరపత్రాలు అందించి కూటమి పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరాచకాలను, మోసాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మోసపూరితమైన కూటమి ప్రభుత్వం గద్దె దిగేవరకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కె.శిరీష, వార్డు పరిశీలకుడు శ్రీనివాసరావు, నాయకులు సాగరిక, భేగం, ప్రసంగి వాసు, అప్పలనాయుడు, జగదీష్, బేత దుర్గారావు, పోలారావు, పి.బంగార్రాజు, గంగరాజు, గోవింద్, బాబూరావు, విమల, భాస్కర్, మేరీ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

- వైఎస్సార్ సీపీ పదో వార్డు అధ్యక్షుడు పతివాడ కనకరాజు, కార్యకర్తలు కలిసి ఇందిరానగర్‌లో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ మోసాలు ప్రజలకు వివరించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా కూటమి నాయకులు కాలం గడుపుతున్నారని వివరించి కరపత్రాలను అందజేశారు. వార్డు పరిశీలకుడు పతివాడ వెంకటలక్ష్మి, వరలక్ష్మి, వీరమ్మ, సుహాసిని, కృష్ణ, సంపత్, శశికుమార్, రత్తయ్య, రవికుమార్, ఆనంద్, నాయుడు, కాంతం పాల్గొన్నారు.
- జీవీఎంసీ 12వ వార్డు నెహ్రూనగర్‌లో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి నాయకుల అరాచకాలు, మోసాలు వివరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పక్కన పెట్టడం, చేస్తున్న మోసాలు గురించి ప్రజలకు తెలియజేస్తూ కరపత్రాలు పంపిణి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మొల్లి హేమంత్, కన్నేటి సుబ్బారెడ్డి, సుజాత, మోహన్, ఈగల బుజ్జి, రాజులమ్మ, సీహెచ్.అర్జున్, లక్ష్మణ్, రాంబాబు, సంతోష్, శ్రీనివాస్, కిశోర్, కేశవ తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్నప్పటికీ మేనిఫెస్టోలో చెప్పిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు అన్నారు. శుక్రవారం జీవీఎంసీ 28వ వార్డులో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను వివరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ మోసాలపై ఇంటింటా ప్రచారం

ఎంవీపీ కాలనీ : ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని వివరిస్తూ 17వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. పార్టీ 17వ వార్డు అధ్యక్షుడు నీలారెడ్డి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఓటర్లను మోసం చేసి అడ్డదారిలో గద్దెనెక్కేందుకే కూటమి నాయకులు మోసపూరిత హామీలు ఇచ్చారని ప్రజలకు వివరించారు. ఆ హామీలను నెరవేర్చకుంటే ఊరుకునేది లేదంటూ కూటమి నాయకులను నిలదీయాలని ప్రజలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో వార్డు మహిళ విభాగం అధ్యక్షురాలు, బూత్ కన్వీనర్ పిల్లా సత్యవతి, యూత్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు కొండబాబు పాల్గొన్నారు.

కూటమి నాయకుల మోసాలను ఎండగట్టండి

మద్దిలపాలెం : ఎన్నికల్లో గెలవడం కోసం ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చిన కూటమి నాయకులను ప్రతి ఒక్కరూ నిలదీయాలని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. జీవీఎంసీ 23వ వార్డు చైతన్యనగర్ పరిధి 255, 257 బూత్‌లలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 140కి పైగా హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసగిస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతీ ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేస్తే... ఆ వాహనాలను చంద్రబాబు తీసేసి మహిళల ఆత్మగౌరవం దెబ్బతీయడం చాలా దురదృష్టకరమన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళల హత్యలు, అత్యాచారాలు ఎక్కువైపోయి రక్షణ లేకుండా పోయిందన్నారు. ఈ ప్రభుత్వానికి మహిళలే బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో వార్డు పరిశీలకులు బోర కుమార్ రెడ్డి, వార్డు అధ్యక్షుడు బూస రమణ రెడ్డి, బూత్ అధ్యక్షులు అవ్వ నర్సింగరావు, పినింట్ల నర్సింగ రెడ్డి, పులగం శ్రీనివాస రెడ్డి, గుడ్ల గణేష్ రెడ్డి, నగిరెడ్ల పోలిశెట్టి, యండ్రేడ్ల ఈశ్వర్ రెడ్డి, పులగం సూర్యనారాయణ రెడ్డి, బోర రామిరెడ్డి, పిలక మధుసూదన రెడ్డి, శశికళ, పిట్ట జగదీశ్ రెడ్డి, పిలక సంపత్ రెడ్డి, అచ్చి సుదీర్ రెడ్డి, కె.వి.రమణ రెడ్డి, అరుణ, బోయి త్రినాథ్, బోన రమణ రెడ్డి, గుదే శ్రీను, సూరిబాబు, అన్నాజీ రెడ్డి, కైలాస్ రెడ్డి, నారాయణ రెడ్డి, వేమల రమణ రెడ్డి పాల్గొన్నారు



మహిళకు చంద్రబాబు మోసాలు వివరిస్తున్న పల్లా దుర్గారావు, నాయకులు



23వ వార్డు చైతన్యనగర్‌లో కరపత్రాలు అందిస్తున్న మొల్లి అప్పారావు

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ ఈస్ట్

9010133346

Office mail : sakshiadvtvsp@gmail.com